
18 దరఖాస్తులు

సిద్దిపేట క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 93 మద్యం దుకాణాలకు మంగళవారం 18 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌మూర్తి తెలిపారు. గజ్వేల్ పరిధిలో 9, చేర్యాల పరిధిలో 1, సిద్దిపేట పరిధిలో 8 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు సిద్దిపేట జిల్లా పరిధిలో మొత్తం 27 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ న్యాయవాదులు

సీజేఐపై దాడికి న్యాయవాదుల నిరసన

సిద్దిపేట క్రైం, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీ.ఆర్. గవాయ్ ‌పైన సోమవారం కోర్టు హాలులో దాడి అనేది న్యాయ వ్యవస్థపై జరిగిన దాడిగా పరిగణిస్తూ మంగళవారం సిద్దిపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. న్యాయవాదులు నల్ల రిబ్బన్లు ధరించి కోర్టు ప్రధాన గేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తాటికొండ రమేశ్ మాట్లాడుతూ దేశ అత్యున్నత వ్యక్తిపై ఇలా దాడికి ప్రయత్నించడం అనేది రాజ్యాంగ వ్యవస్థకు మాయని మచ్చ అని అన్నారు. దాడికి ప్రయత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజేశ్వర్ రెడ్డి, మాచవరం వెంకటేశ్వర్‌రావు, శ్రీశైలం, కర్రోళ్ల రవిబాబు, పి.యాదగిరి, రియాజుద్దీన్, చల్లా మల్లేశం, ఫణికిశోర్, లక్ష్మీనారాయణ, అశోక్, ప్రకాశ్, సూర్యకళ, నాగపూజ, అరుణ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

ఐబీ నుంచి బసవేశ్వరుడి విగ్రహం వరకు నడిచివెళ్లి అధికారులకు సూచనలు

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బైపాస్ రోడ్డు విస్తరణ పనులను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంగ్ జగ్గారెడ్డి, తెలంగాణ పరిశ్రమల మౌలిక సదుపాయాల కల్పన (టీజీఐఐసీ) చైర్‌పర్సన్ నిర్మల రెడ్డిలు మంగళవారం నాడు పరిశీలించారు. పట్టణంలోని ఐబీ గెస్ట్‌హౌస్ నుంచి సాయిబాబా కమాన్, పాత వెలుగు కార్యాలయం, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం, బసవేశ్వర విగ్రహం వరకు దాదాపు 3 కిలోమీటర్ల మేర మున్సిపల్, హెచ్ఎండిఏ, ఆర్అండ్‌బీ, ఫారెస్ట్, విద్యుత్‌శాఖ అధికారులతో కలిసి జగ్గారెడ్డి దంపతులు నడుచుకుంటూ వెళుతూ రోడ్డు విస్తరణపై పలు సూచనలు ఇచ్చారు. విస్తరణ పనులు ఆలస్యంపై జగ్గారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. పనుల జాప్యానికి కారణాలను హెచ్ఎండిఏ అధికారులు అడిగి తెలుసుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు, కరెంట్ స్తంభాలు తొలగించక పోవడం వల్ల పనులు ముందుకు సాగడం లేదని జగ్గారెడ్డి దృష్టికి అధికారులు తీసుకొచ్చారు. దీంతో విద్యుత్, ఫారెస్ట్ శాఖల అధికారులకు వాటిని తక్షణమే తొలగించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా రోడ్డు విస్తరణ పనులు వేగంగా చేయాలని సూచించారు. ఈ రోడ్డు విస్తరణలో నాలుగు ప్రధాన కూడళ్ల వద్ద జంక్షన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు. రోడ్డు వెంట అక్కడక్కడ జగ్గారెడ్డి స్వయంగా కొలతలు వేసి పరిశీలించారు.



బైపాస్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించేందుకు అధికారులతో కలిసి నడిచి వెళ్తున్న జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మల

టెన్షన్.. టెన్షన్


స్థానిక సంస్థల ఎన్నికలపై ఏం జరుగునో..

రిజర్వేషన్లపై ఆశావహుల ఉత్కంఠ

వాయిదా పడతాయా.. జరుగుతాయా అంటూ చర్చ

పల్లెల్లో మారుతున్న రాజకీయ పరిణామాలు

ముగ్గురు పిల్లలున్నా పోటీకి అనుమతివ్వాలని విన్నపాలు



పల్లెల్లో ఎన్నికల పోరు కొనసాగుతుందా.. వాయిదా పడుతుందా అనే విషయం మరికాసేపట్లో తేటతెల్లం కాబోతున్నది. స్థానిక, పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్లపై నేడు హైకోర్టు తీర్పు వెలువరించనుంది. పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేశారంటూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పలువురు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రిజర్వేషన్లను కూడా ప్రకటించడంతో గ్రామాల్లో రాజకీయం వేడెక్కింది. అయితే హైకోర్టు తీర్పుతో పల్లె వాతావరణం అట్టుడుకుతుందా.. చల్లారుతుందా అనే విషయంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

సంగారెడ్డి, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పల్లెల్లో ఎక్కడ చూసినా స్థానిక ఎన్నికలకు సంబంధించిన చర్చ జరుగుతోంది. ఈ చర్చకు నేటితో ముగింపు అనివార్యమైంది. నామినేషన్లు, పోలింగ్ తేదీలు ఖరారు కావడంతో ఎన్నికలను నిర్వహిస్తారని కొందరు.. రిజర్వేషన్లు అశాస్త్రీయంగా ఉన్నందున ఎన్నికలు జరగవని మరి కొందరు వాదిస్తున్నారు.

ఇష్టంగా.. కష్టంగా

ఇటీవల ప్రకటించిన రిజర్వేషన్లు కొందరికి కష్టంగా.. మరికొందరికి ఇష్టంగా మారాయి. రిజర్వేషన్లు ఇలాగే ఉండాలని ఓ వర్గం అంటుండగా, కచ్చితంగా మార్చాలని మరో వర్గం కోరుతున్నది. విషయం కోర్టుకు చేరడంతో అందరిలోనూ సందేహాలు ఉత్పన్నమయ్యాయి. ఎన్నికలు జరుగుతాయని కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం పూర్తి ధీమాను కనబరుస్తుండగా.. ఇతర పార్టీల నాయకులు కొట్టిపారేస్తున్నారు.

మొదలైన రాజకీయ వలసలు

ఎన్నికల వాతావరణం వేడెక్కడం, రిజర్వేషన్ల ప్రకటన మూలంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో రాజకీయ వలసలు మొదలయ్యాయి. బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి బీఆర్ఎస్‌లోకి ఇటీవల పలువురు నేతలు వలస వచ్చారు. కేటీఆర్, హరీశ్‌రావు సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్, బీజేపీల్లోకి చేర్చుకోవడానికి అదేస్థాయిలో పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ప్రకటించిన రిజర్వేషన్ల ప్రకారం చేర్పులు, మార్పులు కొనసాగుతుండగా.. ఒకవేళ మళ్లీ రిజర్వేషన్లు మారితే ఆ దిశగా కూడా వలసలు పెరిగే అవకాశం లేకపోలేదు. ప్రధానంగా ఉమ్మడి మెదక్ జిల్లాలోని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జడ్పీ స్థానాలను క్రితంసారి బీఆర్ఎస్ పార్టీ క్లీన్‌స్వీప్ చేసింది. ఈసారి కూడా అదే ధీమాతో ఉంది. మరోవైపు జడ్పీలో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీజేపీలు సైతం సిద్ధమవుతున్నాయి. మూడు జిల్లాల్లో ఒక్కటైనా దక్కించుకోవాలని కాంగ్రెస్, బీజేపీ కసరత్తు ప్రారంభించాయి.

ముగ్గురు పిల్లలపై సందిగ్ధం

ముగ్గురు పిల్లలు ఉన్నవారు పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చా.. లేదా అనే విషయంపై అస్పష్టత నెలకొంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన మున్సిపల్ కొత్త చట్టం ప్రకారం ముగ్గురు

మిగతా 7వ పేజీలో



అదనపు తరగతుల్లో భాగంగా చదువుకుంటున్న విద్యార్థులు

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- సిద్దిపేట విద్యాశాఖ ప్రణాళిక..
- జనవరి లోగా పార్ట్ - 2 సిలబస్ పూర్తయ్యేలా షెడ్యూల్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : గత వైఫల్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి పదో తరగతి ఫలితాల్లో జిల్లాను మళ్లీ అగ్రస్థానంలో నిలబెట్టాలనే లక్ష్యంతో సిద్దిపేట జిల్లా విద్యాశాఖ పకడ్బందీ ప్రణాళికను అమలు చేస్తోంది. ముందస్తుగానే అదనపు తరగతులను ప్రారంభించి, జనవరి నాటికి సిలబస్‌ను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రతి విద్యార్థికి మెరుగైన ఫలితాలు అందేలా 75 రోజుల స్పెషల్ క్లాస్ షెడ్యూల్‌ను సిద్ధం చేసింది.

గతేడాది కంటే ముందుగానే పదోతరగతి విద్యార్థులకు అదనపు తరగతులను మొదలుపెట్టారు. జిల్లాలో పదవ తరగతి ఉన్న 396 విద్యా సంస్థల్లో 15,512 మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు 11,821 మంది ఉన్నారు. గతంలో సిద్దిపేట జిల్లా పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన స్థానంలోనే ఉంది. అయితే గత ఏడాది మాత్రం 25వ స్థానానికి పరిమితమైంది. మళ్లీ జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాలనే లక్ష్యంతో విద్యాశాఖ ముందుగానే కార్యాచరణ అమలు చేస్తోంది. ఈ నెల 6 నుంచి జనవరి 9 వరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి 75 రోజుల స్పెషల్ సిలబస్ ప్లాన్‌ను సిద్ధం చేసింది. ప్రతిరోజు సాయంత్రం 4.15 నిమిషాల నుండి 5.15 నిమిషాల వరకు ప్రత్యేక అదనపు తరగతులను నిర్వహిస్తుంది. ఒక్కోరోజు ఒక సబ్జెక్ట్ బోధిస్తారు.

SSC Special Class Schedule (Subject wise) for the AY 2025-26
(From 06.10.2025 to 09.01.2026) - (Evening Session 04:15 pm to 05:15 pm)

Sl. No	First Language	Second Language	English	Mathematics	Physical Science	Biological Science	Social Studies
1	06-10-2025	10-10-2025	13-10-2025	07-10-2025	09-10-2025	08-10-2025	14-10-2025
2	15-10-2025	21-10-2025	22-10-2025	17-10-2025	18-10-2025	16-10-2025	27-10-2025
3	28-10-2025	30-10-2025	29-10-2025	23-10-2025	24-10-2025	25-10-2025	31-10-2025
4	13-11-2025	12-11-2025	04-11-2025	01-11-2025	07-11-2025	03-11-2025	06-11-2025
5	21-11-2025	22-11-2025	20-11-2025	10-11-2025	17-11-2025	11-11-2025	14-11-2025
6	29-11-2025	01-12-2025	25-11-2025	19-11-2025	26-11-2025	15-11-2025	18-11-2025
7	08-12-2025	11-12-2025	28-11-2025	24-11-2025	04-12-2025	05-12-2025	27-11-2025
8	16-12-2025	19-12-2025	06-12-2025	02-12-2025	12-12-2025	17-12-2025	03-12-2025
9	24-12-2025	30-12-2025	15-12-2025	10-12-2025	22-12-2025	23-12-2025	09-12-2025
10	03-01-2026	07-01-2026	31-12-2025	18-12-2025	06-01-2026	05-01-2026	20-12-2025
11	08-01-2026	-	09-01-2026	27-12-2025	-	-	29-12-2025
12	-	-	-	02-01-2026	-	-	-
Total Days	11	10	11	12	10	10	11

Total days from 06.10.2025 to 09.01.2026 :	96	* Total Sundays :	13
* Total Second Saturdays :	03	* Total Festivals :	05
* Total Working Days for Spl Classes:	75		

పదవ తరగతి విద్యార్థుల స్పెషల్ క్లాసుల షెడ్యూల్

ప్రారంభం కానున్న పార్ట్ 2 సిలబస్

మొదటి సమ్మిటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ 1) కు ముందుగానే పార్ట్ 1 సిలబస్ పూర్తి కావాలి. అంటే 50 శాతం పాఠ్యాంశ బోధన పూర్తవ్వాలి.

మిగతా 8వ పేజీలో



మృతురాలి ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ప్రాణం తీసిన ప్రేమ వివాహం

- ఏడాది క్రితం ఇంట్లో నుంచి వెళ్లి పెళ్లి.. నెల క్రితం తీసుకొచ్చిన అమ్మాయి తల్లిదండ్రులు
- మళ్లీ ఇంట్లో నుంచి వెళ్లిపోయిన జంట
- ఆగ్రహంతో అబ్బాయి ఇంటిపై దాడి..అతని తల్లికి గాయాలు
- ఆస్పత్రిలో మృతి

జగదేవ్‌పూర్, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): కుల, మతాలు కాదని ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట ఇంటికి వచ్చి- కొన్ని రోజుల తర్వాత మళ్లీ ఇల్లు వదిలి వెళ్లిపోయారు. ఆగ్రహం చెందిన అమ్మాయి తరపు వారు దాడి చేయడంతో అబ్బాయి తల్లి గాయపడి ఆస్పత్రిలో మృతి చెందింది. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం బస్వాపూర్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఎస్సై కృష్ణారెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అలేటి అపర్ణ, అబ్బాస్ కుల, మతాలు కాదని ప్రేమించుకున్నారు. వారి ప్రేమకు పెద్దలు అడ్డు చెప్పడంతో ఇంటి నుంచి పారిపోయి ఏడాది క్రితం పెళ్లి చేసుకున్నారు. నెల రోజుల క్రితం అమ్మాయి తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి ఇంటికి తీసుకొచ్చారు. ఇద్దరూ ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. మంగళవారం ఇద్దరూ మళ్లీ ఇంటి నుంచి వెళ్లిపోయారు.

మిగతా 8వ పేజీలో

ఘనంగా శరత్ పౌర్ణమి వేడుకలు

కొండపాక/చిన్నకోడూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): కొండపాక మండలం మర్పడగలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం శరత్ పౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మోహన కృష్ణ శర్మ, వేదవ్యాస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు చీకోటి మల్లికార్జున్, రాజేంద్రప్రసాద్, మల్లేశం, గట్టు విఠల్, నరసింహా రెడ్డి పాల్గొన్నారు. మర్పడగ క్షేత్రాన్ని మంగళవారం కలెక్టర్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



మల్లికార్జునస్వామికి పూజలు చేస్తున్న కలెక్టర్



మర్పడగ క్షేత్రంలో శరత్ పౌర్ణమి వేడుకలు

రైల్వే నిర్మాణ పనులను ఆపడం సరికాదు

రైల్వేలైన్ నిర్మాణ పనులను ఆపడం సరి కాదని కలెక్టర్ హైమావతి అన్నారు. చిన్నకోడూరు మండలం గంగాపూర్ శివారులో జరుగుతున్న రైల్వే లైన్ నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. కొంత మంది రైతులు నష్ట పరిహారం రాలేదని రైల్వే లైన్ నిర్మాణ పనులను ఆపుతున్నారనే సమాచారం నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి ఆయా రైతులతో ఆమె మాట్లాడారు.

ఈఏపీసెట్

కౌన్సెలింగ్ ప్రారంభం

నంగునూరు, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలం రాజగోపాలపేట పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం టీజీఈఏపీసెట్ (బైపీసీ) 2025 కౌన్సిలింగ్ ప్రారంభమైనట్లు ప్రిన్సిపల్ ఎ.గోవర్ధన్ తెలిపారు. ఇంటర్ (బైపీసీ) ఉత్తీర్ణులై టీజీఈఏపీసెట్ 2025 ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఫార్మసీ, ఫార్మ్ డీ, ఫార్మాస్యూటికల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ కోర్సులలో ప్రవేశం పొందేందుకు మూడు రోజులపాటు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 7 నుంచి 9 వరకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్లాట్ విధానంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో ధ్రువపత్రాల పరిశీలన చేస్తారని చెప్పారు. వెబ్ ఆప్షన్‌కు సంబంధించిన సూచనలు ఇస్తారని సోమవారం 300 మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. కళాశాల అధ్యాపకులు అభినవ్ పర్యవేక్షణలో వై.రాజు, వి.రామకృష్ణ, సయ్యద్ షహబాజ్, విజయకుమార్, శ్రీనివాస్, మధుబాబు, దీపిక, నవీన్ కుమార్, రాజేష్, మంజుల, వాణి, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేట బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ (ఫైల్)

సిద్దిపేట ఆర్టీసీ డిపోకు

కాసుల పంట

- గతేడాది కంటే రూ.21లక్షలు అధికం
- బతుకమ్మ, దసరా నేపథ్యంలో మహిళా ప్రయాణికుల రద్దీ
- ప్రత్యేక బస్సులపై అదనపు చార్జీ వసూలు

సిద్దిపేటఅర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. మహిళలకు ఉచిత ప్రయాణ పథకం ఈ రద్దీని, తద్వారా ఆదాయాన్ని అమాంతం పెంచేసింది. సిద్దిపేట పరిధిలో ఏకంగా రూ. 21 లక్షల అదనపు ఆదాయం నమోదైంది. అయితే, ఊహించని రద్దీ కారణంగా ముఖ్యంగా కరీంనగర్ వంటి రూట్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. స్పెషల్ బస్సులపై 50 శాతం అదనపు చార్జీలు వసూలు చేసినా, ప్రయాణికుల తాకిడి తగ్గలేదు. పండుగ పూట ఆర్టీసీకి ఆదాయం పెరిగినా, ప్రయాణ కష్టాలు మాత్రం తప్పలేదు. సిద్దిపేట డిపోలో 53 ఆర్టీసీ, 53 అద్దె బస్సులతో కలిపి మొత్తం106 బస్సులు వివిధ రూట్లలో ప్రయాణిస్తున్నాయి. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ డిపోలో 77 బస్సులు, దుబ్బాక డిపోలో 38, హుస్నాబాద్ డిపోలో 40 బస్సులు ప్రయాణికులకు సేవలు అందిస్తున్నాయి. దసరా బతుకమ్మ పండుగకు సంబంధించి సిద్దిపేట పరిధిలోని ఆర్టీసీ డిపోలకు 2024 సంవత్సరంలో 73000 కిలోమీటర్లకు రూ.52 లక్షల ఆదాయం రాగా ప్రస్తుతం లక్ష కిలోమీటర్ల ప్రయాణంలో రూ.73 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. గతంలో కంటే రూ.21 ఆదాయం పెరిగినట్లు సమాచారం. పండుగ రెండు రోజులు మాత్రమే అదనపు ఈ చార్జీలు వర్తించాయని, ఆర్టీసీ అధికారులు స్పష్టం చేశారు. ఇక పండుగ రోజుల్లో 50 నుంచి60 ట్రిప్పులు అదనంగా నడిపినట్లు సమాచారం.


ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతాం

ప్రతి ఏడాదిలానే ఈ సారి కూడా బతుకమ్మ, దసరా పండుగలకు రద్దీ ఎక్కువగా ఉంది. ఆర్టీసీ మేనేజర్ రఘు తెలిపారు. రద్దీ దృష్ట్యా అదనపు ట్రిప్పులను నడిపాం. భవిష్యత్తులో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడతాం

\- రఘు, ఆర్టీసీ మేనేజర్ సిద్దిపేట



మన చుట్టూ అద్భుత లోగిళ్లు



"అగ్గిపుల్ల, సబ్బుబిళ్ల కాదేదీ కవితకు అనర్హం". అక్షరాల సృష్టికర్త అయిన కవికి ఉన్నట్టుగానే, ఫొటోగ్రాఫర్‌కు కూడా తన చుట్టూ ఉండే ప్రకృతి సౌందర్యాన్ని కళాత్మకంగా బంధించే శక్తి ఉంటుంది. ఒక్క క్లిక్‌తో లక్షలాది మదిని కదిలించగలడు. ప్రపంచాన్ని అలరించగలడు. తన చుట్టూ ఉన్న అందమైన ప్రపంచాన్ని ఆవిష్కరించగలడు. దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి దుబ్బాక మండలం పెద్దగుండవెల్లిలోని దృశ్యాలు. ఈ ఊరిలోని లొద్దికుంట ప్రాంతం, సూర్యోదయం/సూర్యాస్తమయం వేళల ప్రకృతి రమణీయతను ఆంధ్రజ్యోతి కెమెరా బంధించింది.

\- దుబ్బాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి)

చంపుతాడని.. చంపేశారు.!

● పథకం ప్రకారమే రౌడీ షీటర్ హత్య
● 24గంటల్లో చేధించిన సర్కిల్ పోలీసులు

రామాయంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తరచూ భయభ్రాంతులకు లోను చేస్తూ చంపుతానని బెదిరించిన రౌడీషీటర్‌నే అదను చూసి మట్టుబెట్టారు. వరుసకు సోదరులైన మూడు కుటుంబాలపై హతుడు, పగ పెంచుకోగా.. ఎలాగూ బతకనివ్వడని ఆ సోదరులు ప్రతీకారేచ్చకు పాల్పడ్డారు. మెదక్ జిల్లా చిన్న శంకరపేట మండలం శాలిపేటలో ఆదివారం జరిగిన ఉప్పరి యాదగిరి(45) హత్య కేసును 24 గంటల్లోపే పోలీసులు చేధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ సోమవారం రామాయంపేటలో వెల్లడించారు. హత్యకు గురైన ఉప్పరి యాదగిరి పాత నేరస్థుడు. అతడిపై గతంలో హత్యాయత్నం, పలు దొంగతనాల కేసులు ఉండటంతో పోలీసులు రౌడీషీటర్‌గా చేర్చారు. అయినా అతడి ప్రవర్తనలో మార్పు రాక పాలివాళ్ళు అయిన ఉప్పరి శ్యాములు, ఉప్పరి రాములు, ఉప్పరి ఎల్లంలను టార్గెట్ చేసి ఆ ఇంట్లోనే మహిళలను వేధించసాగాడు. అంతేకాదు ఒకరిని అక్రమంగా కేసులో ఇరికించాడు, మరొకరిని దారుణంగా కొట్టి చంపే ప్రయత్నం చేశాడు. ఇది చాలదన్నట్లు పదే పదే ప్రాణాలు తీస్తానని బెదిరింపులకు పాల్పడడంతో.. వేగలేక వరుసకు సోదరులైన పై ముగ్గురు మూడు రోజుల క్రితం అతడిని చంపాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆదివారం ఇంట్లోనే ఒంటరిగా దొరికిన యాదగిరిని బయటకు లాక్కొచ్చి కింద పడేశారు. పథకం ప్రకారం ముగ్గురు పెద్ద బండరాయితో మోపి చంపి పరారయ్యారు. పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇదే మండలం గవ్వల పల్లి ఎక్స్ రోడ్డు వద్ద వారిని పట్టుకుని విచారించారు. తామే హత్య చేసినట్లు అంగీకరించడంతో పై ముగ్గురిపై కేసులు నమోదు చేసి సోమవారం రిమాండ్‌కు తరలించారు.


రామయంపేట సర్కిల్ కార్యాలయంలో నిందితులను చూపుతున్న డీఎస్పీ నరేందర్ గౌడ, సీఐలు

28 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

రామచంద్రాపురం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని కొల్లూరు పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. సీఐ గణేష్ పటేల్ కథనం ప్రకారం.. మహారాష్ట్ర లాథూర్‌కు చెందిన షేక్ మహబూబ్‌బహదూర్(49) శంషాబాద్ నుంచి అక్రమంగా కర్ణాటకకు రేషన్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు కొల్లూరు ఔటర్ రింగ్ రోడ్డుపై పోలీసులు కాపుకాచి పట్టుకున్నారు. పౌరసరఫరాల అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ చెప్పారు.

ఇండియా పాలస్తీనా పక్షాన నిలుస్తోందంటూ ప్రదర్శన

● సంగారెడ్డిలో స్టిక్కర్లు.. తొలగించిన పోలీసులు



ఇండియా స్టాండ్స్ విత్ పాలస్తీనా అంటూ పోస్టర్‌తో ప్రదర్శన

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియా పాలస్తీనా దేశం తరపున నిలుస్తోందంటూ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో మంగళవారం రాత్రి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రదర్శన జరిపారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో పోస్టర్‌ను చేబూని నినాదాలు చేశారు. కొన్ని కంపెనీల సబ్బులు, కూల్‌డ్రింక్స్‌ను బైకాట్ చేయాలంటూ వారు ప్లకార్డులు ధరించారు. దీనికి సంబంధించిన స్టిక్కర్లను అక్కడే అతికించారు. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకోగా అప్పటికే గుర్తు తెలియని వ్యక్తులు అక్కడి నుంచి పరారయ్యారు. వారు అతికించిన స్టిక్కర్లను పోలీసులు తొలగించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఇటువంటి కార్యక్రమం చేపట్టిన వారిని గుర్తించి తగు చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

వాల్మీకి జీవితం.. అందరికీ ఆదర్శం


సంగారెడ్డి కలెక్టరేట్‌లో మహర్షి వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య


కలెక్టరేట్‌లో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్


వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సంగారెడ్డి ఎస్పీ పంకజ్


మెదక్ పోలీసు కార్యాలయంలో వాల్మీకి మహర్షి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ ఎస్పీ శ్రీనివాసరావు

సంగారెడ్డి క్రైం/మెదక్ అర్బన్/సంగారెడ్డి రూరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మెదక్, సంగారెడ్డి కలెక్టర్లు వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. పోలీసులు, అధికారులు తదితరులు వాల్మీకి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి

● సిద్దిపేట జిల్లా జిల్లెలగడ్డ గురుకులంలో విషాదం


రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న వివేక్ బంధువులు,గ్రామస్థులు


వివేక్ (ఫైల్)

హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం జిల్లెలగడ్డలోని బాలుర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ప్రమాదవశాత్తు మెడకు తాడు చుట్టుకుని చనిపోయాడని ఉపాధ్యాయులు చెబుతుండగా, తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని కుటుంబీకులు పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. నంగునూరుకు చెందిన సనాదుల సత్యనారాయణ, లావణ్య దంపతుల రెండో కుమారుడు వివేక్ జిల్లెలగడ్డ గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. దసరా సెలవుల అనంతరం సోమవారం పాఠశాలకు వచ్చాడు. మంగళవారం ఉదయం డ్రిల్ ప్రిరియడ్‌లో హాస్టల్ కారిడార్‌లో ఆడుకుంటుండగా, మెడకు తాడు చుట్టుకుని మృతి చెందాడని ఉపాధ్యాయులు తెలిపారు. తమ కుమారుడి మృతిపై పాఠశాల యాజమాన్యం చెబుతున్న కారణాన్ని వివేక్ తల్లిదండ్రులు ఖండించారు. ముందుగా దెబ్బలు తగిలాయని చెప్పారని, ఇక్కడికి వచ్చి చూస్తే తమ కుమారుడు చనిపోయి ఉన్నాడని తండ్రి సత్యనారాయణ బోరున విలపించారు. విద్యార్థి మృతిపై న్యాయ విచారణ జరిపించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బంధువులు, గ్రామస్థులు పాఠశాల ఎదుట రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని.. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు ధర్నా విరమించారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

● చికిత్స పొందుతూ యువకుడు మృతి


వట్టెం రమేష్ (ఫైల్)

చేగుంట అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం చేగుంట మండల పరిధిలోని పొలంపల్లిలో చోటుచేసుకుంది. చేగుంట ఎస్సై చైతన్యకుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టెం రమేష్ (32) వ్యవసాయం కోసం అప్పులు చేశాడు. ఈ విషయమై భార్యాభర్తలు తరచుగా గొడవలు పడుతుండేవారు. ఈనెల 4న మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్ తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడికి భార్య మమత, 12 సంవత్సరాలలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్సై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

తిప్పారం గ్రామంలో హత్య

గజ్వేల్ రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): కూడవెల్లి వాగులో కాళ్లు చేతులు కట్టేసి ఉన్న శవం లభ్యంమైంది. ఈ ఘటన మంగళవారం కుకునూరుపల్లి మండల పరిధిలోని సింగాటం, తిప్పారం సరిహద్దుల్లో వెలుగు చూసింది. తిప్పారం గ్రామానికి చెందిన మహేందర్ (36) వాగులో శవమై ఉన్నాడని తెలుసుకొని సంఘటనా స్థలానికి కునూరుపల్లి పోలీసులు చేరుకొని మృతదేహాన్ని గజ్వేల్ మార్చురీకి తరలించారు. మహేందర్ కాళ్లు చేతులు కట్టేసి ఉండడంతో ఎవరైనా దుండగులు హత్య చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

యువకుడి అదృశ్యం


రాజేష్ (ఫైల్)

మిరుదొడ్డి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి): యువకుడి అదృశ్యమైన ఘటన మంగళవారం మిరుదొడ్డి మండలం మల్లుపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై సమతా తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాజేష్ అనే యువకుడు సోమవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లి ఇంటికి రాలేదు. దీంతో చుట్టుపక్కల వెతికినా కూడా ఫలితం లేకపోవడంతో మంగళవారం యువకుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు చేశాడు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.భవానీ చంద్ర మంగళవారం నాడు తీర్పు చెప్పారు. జిల్లా ఎస్పీపరితోష్ పంకజ్ తెలిపిన వివరాల ప్రకారం.. చౌట్కూర్ మండలం కేంద్రానికి చెందిన పెద్దగొల్ల బీరప్ప(32) కూలీ పనులు చేసుకుంటూ సదాశివపేట మండలం నిజాంపూర్‌లో నివాసముండేవాడు. సదాశివపేటకు చెందిన పాపయ్య అనే వ్యక్తిని 2021 ఆగస్టు 5వ తేదీన పాతకక్షల నేపథ్యంలో సదాశివపేటలోని లక్ష్మీకాంప్లెక్స్ వద్ద పెద్ద రాయితో తలపై కొట్టి హత్య చేశాడు. మృతుడి కుమారుడు పెద్దగొల్ల సుభాష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి పూర్తి ఆధారాలను కోర్టులో సమర్పించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడు పెద్దగొల్ల బీరప్పకు యావజ్జీవ కారాగార జైలు శిక్షతో పాటు రూ.100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు.

తల్లిదండ్రుల చెంతకు చేరిన చిన్నారి

జహీరాబాద్,అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో తప్పిపోయిన అఖిలేష్(5)అనే బాలుడిని తండ్రికి అప్పగించడమైందని స్టేషన్‌మేనేజరు మాధవక్రిష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుంచి బీదర్‌మీదుగ పూర్ణకు వెళ్తున్న రైలులో బీదర్‌కు చెందిన బాలుడు అఖిలేష్, తండ్రి స్వామిదాస్, మరోఇద్దరు కుమారులతో కలిసి హైదరాబాద్ నుంచి బీదర్‌కు వెళ్తున్నారన్నారు. ఈ క్రమంలో తండ్రి రైలులోనేగల వాష్రూంలోకి వెళ్ళగ అఖిలేష్ అనే బాలుడు ఇతరులతో కలిసి జహీరాబాద్ రైల్వేస్టేషన్‌లో దిగాడన్నారు. దీంతో బాలుడిని గమనించిన తాము తమవద్దకు పిలిపించుకుని వివరాలు అడిగితే మొబైల్‌నెంబరు, గ్రామం పేరు చెప్పాడన్నారు. వెంటనే తండ్రి స్వామిదాస్‌కు ఫోన్‌చేయగా అయన జహీరాబాద్ రైల్వేస్టేషన్‌కు రావడంతో రైల్వే అధికారుల సమక్షంలో తండ్రికి అప్పగించారు. స్టేషన్‌మేనేజర్‌కు తండ్రిస్వామిదాస్ కృతజ్ఞతలు చెప్పాడు.

అదుపు తప్పి నీటిలోకి దూసుకెళ్లిన ఆటో

శివ్వంపేట, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): ఆటోలో నుంచి గేదె రోడ్డుపై దూకడంతో ఆటో అదుపుతప్పి నీటిలో పడింది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా ఆటో నీటిలో కూరుకు పోయింది. ఈ ఘటన మంగళవారం తూప్రాన్ నర్సాపూర్ జాతీయ రహదారి శివంపేటలో చోటుచేసుకుంది. ప్రయాణికులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ట్రాలీ ఆటోలో సిద్దిపేట నుంచి గేదును శివంపేట మీదుగా సంగారెడ్డికి తీసుకువెళ్తుండగా రన్నింగ్‌లో ఉన్న ఆటోల నుంచి గేదె ఒక్కసారిగా రోడ్డుపై దూకడంతో ఆటో అదుపు తప్పి రాజన్న వాగు సమీపంలో ఆటో రోడ్డు కిందికి దూసుకెళ్లి నీటిలో పడి మునిగిపోయింది. వడంతో మంగళవారం జేసీపీ సాయంతో ఆటోను వెలికి తీశారు. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు.

తలపై బ్యాటుతో కొట్టి..

● 5తులాల బంగారం ఎత్తుకెళ్లిన దుండగుడు

దుబ్బాక/మిరుదొడ్డి,అక్టోబరు7(ఆంధ్రజ్యోతి):వృద్ధురాలిని బ్యాటుతో బాది 5తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలం పోతరెడ్డిపేట గ్రామంలో చోటుచేసుకుంది. మంగళవారం భూంపల్లి ఎస్సై హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. పోతరెడ్డిపేట గ్రామానికి చెందిన రాజమణి (69) భర్త శంకరయ్య ఉల్లిగడ్డలను అమ్ముకోవడానికి వెళ్లాడు. అంగడినుంచి ఇంటి వచ్చిచూసేసరికి రాజమణి రక్తపుమడుగులో ఉంది. భార్య రాజమణి తెలిపిన విషయం ఏమనగా గ్రామానికి చెందిన జూకంటి మల్లారెడ్డి అనే వ్యక్తి ఇంట్లోకి వచ్చి గోడలు తేమవస్తుందని తెలిపారు. వెనకనున్న రాజమణి మెడను పట్టుకుని గోడకు కొట్టడంతోపాటు పక్కనే ఉన్న బ్యాటుతో తలపై బాధటంతో తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో ఆమె మెడలోని ఐదు తులాల పుస్తెల తాడును దుండగుడు ఎత్తుకెళ్లాడని భర్తకు చెప్పింది. రాజమణిని 108లో సిద్దిపేట ఆసుపత్రికి తరలించారు. బాధితురాలు భర్త శంకరయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు హత్యమత్నం, దొంగతనం కేసునునమోదు చేసినట్లు తెలిపారు. దుండగుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

కళాశాలకు హక్కుల కమిషన్ వారెంట్

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి సమీపంలోని సురభీ కళాశాలకు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. హ్యూమన్ రైట్స్ (నెంబర్ 4777/2025)కు డాక్టర్ మెరుగు కార్తీక్ ఫిర్యాదు చేసిన మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. కళాశాలలో కార్తీక్ సమర్పించిన సర్టిఫికేట్లను సమయానికి ఇవ్వకపోవడంతో పీజీ ప్రవేశం ఆగిపోయిందని సదరు వ్యక్తి ఫిర్యాదు చేయడంతో కమిషన్ పూర్వపు ఉత్తర్వులను సంస్థ పాటించకపోవడమే కాకుండా, కమిషన్ సమన్లకు కూడా హాజరు కానందున, కాలేజ్ చైర్మన్, ప్రిన్సిపాల్‌పై బెయిలబుల్ వారెంట్ జారీకి కమిషన్ ఆదేశించింది.

మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993, సెక్షన్ 18(సి) ప్రకారం, కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్, వరంగల్ ఇతర సంబంధిత సంస్థలు రెండు వారాలపాటు ఒరిజినల్ సర్టిఫికెట్లు సమర్పించాలని ఒత్తిడి చేయకూడదని సిఫార్సు చేసింది. ఈ విషయం పై కళాశాల యాజమాన్యాన్ని వివరాలు అడగగా ఎన్ఎంసీ నిబంధనల ప్రకారం ఒక సర్జన్ 365 రోజులలో 158 రోజులు హాజరు కావలసి ఉండగా సదరు మెడికల్ విద్యార్థి అటెండెన్స్ లేకపోవడంతో ఎంఎంసీ ఆదేశాల మేరకే సర్టిఫికేట్లు నిలిపివేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. దీనిపై గతంలో ఆరోగ్య శాఖ కూడా వివరణ ఇచ్చామని హ్యూమన్ రైట్స్‌కు కూడా వివరణ ఇవ్వబోతున్నామని తెలిపారు.

తెల్లవార్లూ.. దాబాలు బార్లా..!

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే లాస్య నందిత (ఫైల్)



జాతీయ రహదారుల పక్కన దాబాలు ఓపెన్ బార్లను తలపిస్తున్నాయి. నిబంధనల విరుద్ధంగా 24 గంటలూ తెరిచి ఉంచుతూ... అర్ధరాత్రి దాటాక డీజే పాటలు, మద్యం సిట్టింగ్‌లకు వేదికగా మారుతున్నాయి. రాజకీయ నాయకుల అండదండలు, నిత్యం పోలీసులకు ముడుపులు అందుతుండడంతో నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. దాబా నిర్వాహకులే రహస్యంగా మద్యం సరఫరా చేస్తున్నారు. ఫలితంగా, మద్యం మత్తులో వాహనాలు నడుపుతున్న ప్రయాణికులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారు.

- పట్టణమంతా నిద్రపోయేవేళ.. అక్కడ మాత్రమే జిగేల్
- 65వ జాతీయ రహదారిపై దాబాల్లో మందు సిట్టింగ్‌లు
- నిబంధనలకు నీళ్లు.. తనిఖీలు నిల్
- మద్యం మత్తులో వాహనచోదకులు.. మామూళ్ల మత్తులో పోలీసులు
- పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు.. కుటుంబాలకు గుండెకోత

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రాత్రయితే పల్లెలు, పట్టణాలు నిద్రపోతున్నా, 65వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న దాబాల వద్ద మాత్రం అర్ధరాత్రి దాటాకే సందడి మొదలవుతుంది. హైదరాబాద్-ముంబై, మహా రాష్ట్రలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. జిల్లాలోని పటాన్‌చెరు నుంచి జహీరాబాద్ వరకు వందల సంఖ్యలో దాబాలు వెలిశాయి. ఇవి ఉదయం నుంచి తెల్లవారుజాము వరకు నిరంతరంగా నడుస్తున్నాయి.

మద్యం సిట్టింగులతో ప్రమాదాలు

సంగారెడ్డికి సమీపంలో కవలంపేట వద్ద ఉన్న కొన్ని దాబాల్లో పగలు సైతం మద్యం సిట్టింగులు కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ఈ దాబాలకు రాజకీయ నాయకుల అండదండలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది. దాబా నిర్వాహకులే వినియోగదారులకు మద్యం సరఫరా చేస్తూ, అధిక ధరలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులకు సౌకర్యంగా ఉండటానికి ఏర్పాటు చేసిన ఈ దాబాలు, రాత్రిళ్లు తెరిచి ఉండటం వల్ల వినియోగదారులు మద్యం సేవించి, తెల్లవారుజామున ప్రయాణాలు చేస్తూ ప్రమాదాలకు గురవుతున్నారు.



65వ నంబరు జాతీయ రహదారిపై సంగారెడ్డి సమీపంలో ఓ దాబా

ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి కారణమిదేనా?

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే జి. లాస్య నందిత (37) గతేడాది ఫిబ్రవరి 23న పటాన్‌చెరు ఓఆర్ఆర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. కుటుంబ సభ్యులను ఇంటి వద్ద దింపిన తర్వాత, తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఆకలి వేస్తుండటంతో బ్రేక్‌ఫాస్ట్ చేసేందుకు శామీర్‌పేట వైపు నుంచి పటాన్‌చెరు వైపు బయలుదేరారు. 65వ నంబర్ జాతీయ రహదారిపై 24 గంటలు దాబాలు నడుస్తుండటం వల్లనే ఆమె బ్రేక్‌ఫాస్ట్ కోసం ఇక్కడికి వచ్చారని, ఒకవేళ దాబాలు మూసివేసి ఉంటే ప్రమాదం జరిగి ఉండేది కాదేమోననే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పోలీసులకు మామూళ్లు

దాబాలు రాత్రి ఒంటి గంట లోపు మూసివేయాలని పోలీసులు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. పట్టణాల్లో రాత్రి 10 గంటలకే దుకాణాలు మూసివేయిస్తున్న పోలీసులు, దాబాల విషయంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దాబాల నిర్వాహకులు ప్రతినెలా పోలీసులకు మామూళ్లు ముట్టచెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అర్ధరాత్రి దాటిన తర్వాత దాబాలు మూసివేస్తే ప్రయాణికులు రోడ్లపై తిరగకుండా ఉంటారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

స్లాట్ బుక్ చేస్తేనే పత్తి రైతులకు మద్దతు ధర

- మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు మల్లేశం



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణలో మాట్లాడుతున్న మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు మల్లేశం

సంగారెడ్డి రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేస్తేనే పత్తి రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర వర్తిస్తుందని మార్కెటింగ్ శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు మల్లేశం స్పష్టం చేశారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులకు మంగళవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లలో పత్తి కొనుగోళ్లకు కొత్త కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ప్రభుత్వం ఈ ఏడాది క్వింటాలు నాణ్యమైన పత్తికి రూ. 8110 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ఈ కొత్త యాప్‌పై వ్యవసాయ, మార్కెటింగ్ శాఖాధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. కపాస్ కిసాన్ యాప్‌లో వివరాల నమోదుతో సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 18005995779 టోల్ ఫ్రీ నంబరులో సంప్రదించాలని వెల్లడించారు. ఈ యాప్‌లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ జేడి శివప్రసాద్, జిల్లాలోని వ్యవసాయ సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు సాధించే వరకు సమ్మె కొనసాగిస్తాం

- డైలీ వేజ్, కాంటిజెంట్ వర్కర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాపారావు



గిరిజన కళాశాల హాస్టల్ ఎదుట చేస్తున్న ఆందోళన

మెదక్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): తమ హక్కులు సాధించుకునే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలంగాణ డైలీ వేజ్, కాంటిజెంట్ వర్కర్ల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ మాడే పాపారావు హెచ్చరించారు. తెలంగాణ గిరిజన ఆశ్రమ స్కూల్స్‌లో పనిచేస్తున్న వర్కర్లు మెదక్‌లోని గిరిజన కళాశాల హాస్టల్ ముందు చేపట్టిన సమ్మె మంగళవారానికి 26వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ని రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తాము న్యాయబద్ధంగా ఇవ్వాల్సిన బెనిఫిట్స్‌నే అడుగుతున్నామని, తమవేవీ గొంతెమ్మ కోరికలు కావని అన్నారు. 212 జీవోను సవరించి 2014 నాటికి ఐదేళ్ల సర్వీస్ ఉన్న వారందరినీ పర్మినెంట్ చేయాలని, కలెక్టర్ గెజిట్ ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కొత్త మెనూ, పెరిగిన పనిభారానికి అనుగుణంగా కార్మికులను పెంచాలని, పూర్తికాలం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు ఇవ్వాలన్నారు. అలాగే, విద్యార్థులతో పాటు కార్మికులకు కూడా రెండు జతల యూనిఫాం, ఐడి కార్డులు, కార్మికులకు రూ. 10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి జె. సునంద, కోశాధికారి ఏ. మాధవి, సలహాదారు నూనె శేఖర్, ఉపాధ్యక్షులు సువర్ణ, సభ్యులు భూలక్ష్మి, జ్యోతి, పెంటమ్మ, రజిత, కిషన్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సొంత ఖర్చుతో గాంధీ విగ్రహం ఏర్పాటు

- సోమ రమేష్ గుప్తాకు అభినందనల వెల్లువ



గాంధీ జయంతి రోజున రమేష్ గుప్తా ఏర్పాటు చేయించిన విగ్రహానికి నివాళి

కొమురవెల్లి, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని పోసానపల్లి గ్రామానికి చెందిన సోమ రమేష్ గుప్తా తన దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో సొంత నిధులు, గ్రామస్తుల సహకారంతో సేకరించిన నిధులు సుమారు రూ.1,20,000లతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. పాఠశాలకు అవసరమైన కుర్చీలు, ఇతర వస్తువులను సమకూర్చారు. విద్యార్థుల కోసం తన సొంత డబ్బులతో ప్రతిరోజు వార్తా పత్రికలను అందిస్తున్నారు. స్వాతంత్ర, గణతంత్ర దినోత్సవాల్లో విద్యార్థులకు అందించే బహుమతుల కోసం సైతం ఆర్థిక సహాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పాఠశాలకు కావలసిన మౌలిక వసతులను కల్పించడానికి రమేష్ గుప్తా ఎల్లప్పుడూ ముందుంటారని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఆయనను అభినందించారు.

ఐఐటీహెచ్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సన్నాహాలు

కంది, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వార్షిక పూర్వ విద్యార్థుల దినోత్సవం-2025, దశాబ్దపు వేడుకలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఐఐటీహెచ్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఉన్న విద్యార్థులందరినీ ఈ వేడుకల్లో పాల్గొనాలని ఐఐటీహెచ్ అధికారులు మంగళవారం ఆహ్వానించారు. వచ్చే సంవత్సరం జనవరి 3, 4 తేదీల్లో రెండు రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ వేడుకల్లో భాగంగా పూర్వ విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం, 2014 బ్యాచ్ విద్యార్థులచే లెగసీ ప్రాజెక్ట్ ఆవిష్కరణ, సాంస్కృతిక ప్రదర్శనలు, క్యాంపస్ టూర్, దశాబ్దపు జ్ఞాపకాలు, అభివృద్ధి వివరాలు, విద్యార్థుల విజయాలు, క్రీడలు వంటి కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ ఖరారు చేశారు. ముఖ్యంగా 2014లో ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో ఐఐటీహెచ్ ప్రారంభమైన తొలినాళ్లలో ఏర్పాటు చేసిన క్లాస్‌రూమ్‌లు మరియు అక్కడి హాస్టల్ వాతావరణాన్ని పూర్వ విద్యార్థులకు చూపించనున్నారు.



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్

ఆవిష్కరణల కేంద్ర బిందువు..

2008లో స్థాపించబడిన ఐఐటీహెచ్, కేవలం 17 సంవత్సరాల స్వల్ప వ్యవధిలో విద్య, పరిశోధన, సాంకేతికత, అభివృద్ధి, స్టార్టప్‌లలో ఉన్నత స్థానాన్ని చేరుకుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్స్ (ఎన్ఐఆర్ఎఫ్)లో, ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీహెచ్ 7వ స్థానానికి చేరుకుంది. ఇన్నోవేషన్‌లో 6 వ స్థానంలో నిలిచింది. ఎన్ఐఆర్ఎఫ్ ప్రారంభించినప్పటి నుంచి ఐఐటీహెచ్ టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో తన ర్యాంక్‌ను నిలబెట్టుకుంది. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్ 2025-26 విద్యా సంవత్సరంలో ఇది 664వ స్థానంలో ఉండి, భారతదేశంలోని టాప్ 10 ఇంజనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లలో ఒకటిగా నిలిచింది.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

- యూబీఆర్ఎస్‌టీఐ డైరెక్టర్ గేము నాయక్



మాట్లాడుతున్న డైరెక్టర్ గేమునాయక్

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (యూబీఆర్ఎస్‌టీఐ) ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ గేము నాయక్ సూచించారు. సిద్దిపేటలో మంగళవారం పుట్టగొడుగుల పెంపకం ఉచిత శిక్షణ తరగతుల ప్రారంభ సమావేశంలో ఆయన మాట్లాడారు. శిక్షణ పూర్తయిన తర్వాత రుణ సదుపాయం కల్పించి, స్వయం ఉపాధి పొందేలా చూస్తామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందడంతో పాటు మరికొంతమందికి ఉపాధినిచ్చే స్థాయికి రావాలని ఆకాంక్షించారు. అలాగే, బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్ కోర్సు ఈ నెల 8 నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తి గలవారు సంస్థలో సంప్రదించాలని ఆయన సూచించారు ప్యాకల్టీ నాగరాజు, నజీం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

పోలీసుల సమక్షంలో తొలగింపులు



దత్తగిరికాలనీ రోడ్డుపై ఆక్రమణలను ఎక్స్‌కవేటర్ల సహాయంతో తొలగిస్తున్న అధికారులు

జహీరాబాద్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మున్సిపల్, పోలీసుల ఆధ్వర్యంలో ఆక్రమణల తొలగింపునకు మంగళవారం శ్రీకారం చుట్టారు. మున్సిపల్ కమిషనర్ సుభాష్ రావు, పట్టణ సీఐ శివలింగం పర్యవేక్షణలో రోడ్లపై ఆక్రమణలకు పాల్పడిన వాటిని తొలగించారు. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని 15 రోజుల క్రితమే నోటీసులు అందజేశామని, వారు స్పందించకపోవడంతోనే తొలగించాల్సి వచ్చిందని అధికారులు తెలిపారు. దత్తగిరి కాలనీ చౌరస్తా మొదలుకుని ఆదర్శనగర్ గేటు వరకు గల 40 అడుగుల రోడ్డుపై ఉన్న ఆక్రమణలను తొలగించారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా తాము ఈ కూల్చివేతల ప్రక్రియ చేపట్టామని వారు చెప్పారు. పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే, ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా ఉండాలంటే ఆక్రమణల తొలగింపు ప్రక్రియ అత్యవసరమని అధికారులు స్పష్టం చేశారు. మున్ముందు పట్టణంలోని భవాని మందిర్ రోడ్డు, బ్లాక్ రోడ్డు, నాగులకట్ట, సుభాష్‌గంజ్‌ల రోడ్లపై కూడా తొలగింపు ప్రక్రియను త్వరలో చేపడతామని పేర్కొన్నారు. ఎవరైనా రోడ్లపై నిర్మాణాలు, తాత్కాలిక షెడ్లు వేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే ఉపేక్షించే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఎస్ఐలు వినయ్‌కుమార్, కాశీనాథ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్షన్.. టెన్షన్

(5వ పేజీ తరువాయి)

పిల్లలు ఉన్నవారికి ఎన్నికల్లో పోటీచేసే అవకాశం ఇచ్చారు. ఆ తర్వాత పంచాయతీ ఎన్నికలు జరగనందున ముగ్గురు పిల్లల విషయం పెండింగ్‌లోనే పడింది. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ముగ్గురు పిల్లలు ఉన్నవారికి గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారని ఇక్కడ కూడా అవకాశం ఇవ్వాలని సంబంధిత ఆశావహులు కోరుతున్నారు. తమ రాజకీయ భవిష్యత్తును కూడా ఇటు హైకోర్టు, అటు రాష్ట్ర ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని విన్నవిస్తున్నారు. ఈ విషయంపై ఆయా జిల్లాల అధికారులు కూడా సరైన స్పష్టత ఇవ్వడం లేదు.

మంజీరా తీరంలో పురాతన శిల్పాలు

- మహిషాసుర మర్దిని, నాగిని విగ్రహాలుగా గుర్తింపు



మంజీరా తీరంలో లభ్యమైన పురాతన శిల్పాలు

కొల్చారం, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): కొల్చారం మండల పరిధిలోని పోతశెట్టిపల్లి శివారులో పురాతనమైన శిల్పాలు బయట పడ్డాయని లైబ్రేరియన్, చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ మంగళవారం తెలిపారు. కిష్టాపూర్ గ్రామ నివాసి యూసుఫ్ ఇచ్చిన సమాచారం మేరకు హనుమాన్ బండల దగ్గర మంజీరా నది తీరాన శిల్పాలను పరిశీలించిన సంతోష్ అవి అష్టభుజ మహీషాసుర మర్దిని, నాగిని శిల్పాలుగా గుర్తించారు. మన చరిత్రకు, వైభవానికి ఆధారమైన ఇలాంటి పురాతన శిల్పాలను నీళ్ల పాలు, మట్టి పాలు చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చారిత్రక సంపదను కాపాడుకోవాలని, వీలైతే గుడిలో లేదా గ్రామ పంచాయతీ కార్యాలయంలోనైనా ఉంచాలని సూచించారు. లేకపోతే ఆలనా పాలనా లేని ఈ శిల్ప సంపదను ఒక్కచోట చేర్చి మ్యూజియం ఏర్పాటు చేసుకోవచ్చని, మెదక్ జిల్లా ఘన వారసత్వాన్ని తర్వాతి తరాలకు అందించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.



శిథిలావస్థలో చెరుకు ప్రవీణ ఇల్లు

ఇందిరమ్మా.. ఇదేనా న్యాయం?

- రేపోమాపో కూలేలా ఇళ్లు
- ఇందిరమ్మ ఇంటి పథకం అత్యవసర జాబితాలో పేర్లను ప్రతిపాదించినా పక్కన పెట్టిన జిల్లా అధికారులు
- దయచూపి ఇల్లు మంజూరు చేయాలని బాధితుల వేడుకోలు

దుబ్బాక, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రెక్కాడితే గానీ కుటుంబం గడవని నిరుపేదలు వాళ్లు.. ఏళ్ల క్రితం కట్టుకున్న వారి పెంకుటిళ్లు ప్రస్తుతం శిథిలావస్థకు చేరాయి. వానొస్తే ఉరుస్తూ.. రేపమాపో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇలాంటి వారికి ముందుగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దుబ్బాక మండలం పద్మశాలి గడ్డ గ్రామంలోని చెరుకు పద్మ, చెరుకు ప్రవీణలకు చెందిన ఇల్లు వానకు లోపలికి నీళ్లు వస్తుండడంతో వంట సామాగ్రి అడ్డం పెడుతూ కాలం వెళ్లదీస్తున్న దుస్థితి నెలకొన్నది. ఇంటిపై టార్పాలిన్లు కప్పుకుని దుర్భర జీవనం సాగిస్తున్నారు. దీంతో గ్రామంలో సుమారు 23 ఇందిరమ్మ ఇళ్లను అత్యవసరం జాబితాలో చేర్చగా, గ్రామ కార్యదర్శి, ఎంపీడీవో, ఇందిరమ్మ కమిటీ ఆమోదంతో వీరి పేర్లను ప్రతిపాదించారు. కానీ, జిల్లా అధికారులు ఈ ప్రతిపాదనలను పక్కనపెట్టి, వేరే కొంతమంది పేర్లను చేర్చి, వీరి ఆశలపై నీళ్లు చల్లారు. దీంతో 'దేవుడు కరుణించినా, పూజారి వరమివ్వని చందంగా అధికారుల తీరు ఉందని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు దయ చూపి వెంటనే ఇళ్లు మంజూరు చేయాలని బాధితులు, గ్రామస్థులు కోరుతున్నారు.



చెరుకు పద్మ ఇంటిపై కప్పిన కవర్

తెల్ల బంగారానికి కష్ట కాలం



జగదేవ్‌పూర్ మండలం తిగుల్‌లో ఎర్రబడిన పత్తి పంట

- భారీ వర్షాలకు పంటల్లో నిలిచిన నీరు
- ఎర్రబడిన పత్తి పంట
- ప్రశ్నార్థకంగా పత్తి రైతుల పెట్టుబడి
- కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణం

జగదేవ్‌పూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) ఎన్నో ఆశలతో సాగు చేసిన పత్తి పంటలు అధిక వర్షాలకు ఎర్రబడ్డాయి. వర్షం నీరు నిలిచి, వైరస్ సోకి తెల్లబంగారం తెల్లబోయింది. ఎకరానికి కనీసం ఐదు క్వింటాళ్ల పత్తి కూడా రాని పరిస్థితి నెలకొన్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది.

మండలంలో పంటల విస్తీర్ణం ఇలా..

జగదేవ్‌పూర్ మండలంలో పలు గ్రామాల్లో వానాకాలం సీజన్‌లో 14,200 వేల ఎకరాల్లో పత్తి, 10వేల ఎకరాల్లో వరి, 220 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో కంది, 300 ఎకరాల్లో కూరగాయలు సాగు చేశారు. మండలంలో ఎక్కువగా నల్ల రేగడి భూములు ఉండడం వల్ల ఇక్కడి రైతులు ఏటా ఎక్కువ సంఖ్యలో పత్తి సాగు వైపే మొగ్గు చూపుతారు. తిగుల్, అలిరాజ్‌పేట, గొల్లపల్లి, మునిగడప, చాట్లపల్లి, వట్టిపల్లి, ఇటిక్యాల, బిజివెంకటాపూర్, దౌలాపూర్, జగదేవ్‌పూర్ తదితర గ్రామాల్లో రైతులు ఎక్కువగా పత్తి సాగు చేశారు.

భారీ వర్షాలతో నష్టం

ఈ సారి భారీ వర్షాల కారణంగా పంట చేలల్లో నీరు నిలిచి పంట ఎర్రబడడంతో పాటు వైరస్ బారిన పడి పంటలన్నీ నల్లబడ్డాయి. మొక్కకు కింద భాగం పత్తి కాయలన్నీ నల్లబడి ముర్కిగా మారిపోయాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎర్ర నేలలో కొంతవరకు బాగున్నా ప్రస్తుతం అవి కూడా ఎర్రబడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి అయినా వచ్చేనా..?

ఎకరానికి సగటున పెట్టుబడి రూ. 30వేల నుంచి 50 వేల వరకు ఖర్చయ్యిందని, ప్రస్తుతం పత్తి పంటలను చూస్తే కూలీలు, పెట్టుబడి ఖర్చు కూడా రాని పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎకరానికి ఐదారు క్వింటాళ్ల పత్తి కూడా వచ్చేటట్టు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరి దారుణంగా తయారైంది. ఎకరానికి రూ. 10 వేల నుంచి 15 వేల వరకు కౌలు చెల్లించినట్లు బాధిత రైతులు చెబుతున్నారు. ఓ వైపు కౌలు, మరోవైపు పెట్టుబడి కలిసి తడిసి మోపెడయ్యాయని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

రైతులను ఆదుకోవాలి



మాకున్న రెండు ఎకరాలతో పాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాం. మొత్తం పంటకు పెట్టుబడి సుమారు రూ. లక్షన్నరకు పైగా అయింది. అధిక వర్షాలతో వైరస్ బారిన పడి ప్రస్తుతం పత్తి పంట ఎర్రబడింది. ఎకరానికి 5 క్వింటాళ్ల పత్తి కూడా వచ్చేలా లేదు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపోయిన రైతులకు ఆదుకోవాలి.

- ఐలయ్య, తిగుల్ రైతు

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సత్వరమే చెల్లించాలి

చేర్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకున్న లబ్ధిదారులకు వెంటనే బిల్లుల చెల్లింపులు చేపట్టాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట్‌మావో కోరారు. మంగళవారం ఆయని చేర్యాలలో విలేకరులతో మాట్లాడారు. బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం చేస్తుండటంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఇళ్లు నిర్మించుకోకపోతే రద్దు చేస్తామని హెచ్చరించారని గుర్తు చేశారు. నేడు అప్పులు చేసి నిర్మాణాలు చేపడుతున్నా బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుందన్నారు. వెంటనే బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

గజ్వేల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల అంశంపై సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలంగాణ జగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... 60శాతం పైగా బలహీనవర్గాల జనాబా ఉన్నప్పటికీ కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం జాగృతి ఉద్యమించి బలహీన వర్గాల్లో కదలిక తీసుకువచ్చినట్లు గుర్తుచేశారు. ఈ నెల 8న హైకోర్టులో 42శాతం రిజర్వేషన్ల అంశంపై విచారణ జరుపనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం కోర్టులో తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సూచించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ విషయంలో అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతును ప్రకటించాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

రోజువారీ కూలీలకు అండగా నిలవాలి



మునిసిపల్ కమిషనర్ బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

గజ్వేల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): రోజువారీ కూలీలకు అండగా నిలవాలని బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఎన్‌సీ సంతోష్ కోరారు. ఈ మేరకు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ చెట్లపల్లి బాలకృష్ణకు ఆయా సంఘాల నాయకులు, మాజీ కౌన్సిలర్ బొగ్గుల చందుతో కలసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వందలాది మంది శ్రామికులు సరైన ఉపాధి అవకాశాలు లేక, ఉన్న కాస్త అవకాశాలు లోకల్, నాన్‌లోకల్ గొడవలతో వెనకబడిపోతున్నారన్నారు. గజ్వేల్‌లో ఏర్పాటు చేయనున్న అంత్యేష్టికి సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. వారితో మాజీ వైస్ ఎంపీపీ అత్తెల్లి లక్ష్మయ్య, ఆర్యవైశ్య సంఘం నాయకులు సత్యనారాయణ, కైలాస ప్రభాకర్, నేతి శ్రీనివాస్, దొంతుల సత్యనారాయణ, పద్మశాలి సంఘం నాయకులు తదితరులున్నారు.

హుస్నాబాద్ యువతికి డాక్టరేట్

హుస్నాబాద్‌రూరల్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణానికి చెందిన యువతి చేప్యాల సుజాత డాక్టరేట్ పట్టా అందుకున్నది. గత నెల 30న హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం 26వ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ జిష్టుదేవ్ వర్మ చేతుల మీదుగా పట్టాను అందుకున్నది. ఆమె ప్రస్తుతం భూపాలపల్లి జిల్లా కాటారంలోని ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. విద్యావిభాగంలో ఆంగ్ల బోధన పద్ధతి ' ఎ స్టడీ ఆన్ ది ఇన్స్ట్రుమెన్స్ ఆఫ్ డిస్ కోర్స్ ఓరియంటెడ్ పెడగాగి ఇన్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ఎట్ సెకండరీ ఎడ్యూకేషన్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ పట్టా దక్కింది. డాక్టరేట్ అవార్డు అందుకున్న సుజాతను మంగళవారం సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆకుల రజిత, వైస్‌చైర్మన్ అనితారెడ్డి తదితరులు అభినందించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



జగదేవ్‌పూర్: దౌలాపూర్‌లో పిల్లలకు పోషకాహారాన్ని అందిస్తున్న వైద్యాధికారి డాక్టర్ సత్య ప్రకాష్

జగదేవ్‌పూర్, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని జగదేవ్‌పూర్ మండల వైద్యాధికారి డాక్టర్ సత్య ప్రకాష్ పేర్కొన్నారు. పోషణ మాసం ఉత్సవాలలో భాగంగా మంగళవారం జగదేవపూర్ మండలంలో దౌలాపూర్, అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాస ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి ఏటా పోషణ మాసం ఉత్సవాలను నిర్వహిస్తూ పౌష్టికాహారంపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలలో కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేస్తున్నారని, వీటి ద్వారా సరైన పోషకాహారం అందుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆకుకూరలు, పప్పులు, చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. ఆరేళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు. అనంతరం గర్భిణి స్త్రీలకు సాముహిక శ్రీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, సంతోష, పోషణ్ అభియాన్ సూపర్‌వైజర్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి సతీష్ అంగన్‌వాడీ టీచర్లు పుష్ప, సుజాత, పద్మ, సంతోష ఆయాలు పాల్గొన్నారు.

- **బెజ్జంకి:** పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగరాణి అన్నారు. పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని దాచారం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్‌లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.



బెజ్జంకి: దాచారంలో అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి



ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు

తొగుట, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని తొగుట ఎస్‌ఐ రవికాంత్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని ఘనపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, సైబర్ నేరస్తులు పంపే ఏ లింకులు కూడా ఓపెన్ చేయవద్దని, ఏదైనా నేరం జరిగితే వెంటనే 1930 సైబర్ సెల్ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి తెలపాలన్నారు. మైనర్ డ్రైవింగ్, డయల్ 100 ప్రాముఖ్యత సమాజంలో జరుగుతున్న నేరాల నుంచి ఎలా రక్షణ పొందాలనే అంశాలపై విద్యార్థులకు ఎస్‌ఐ వివరించారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ అంజలి, షీటీం ఏఎస్‌ఐ శ్రీరాములు, హెడ్‌కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డితో పాటు తొగుట పోలీస్‌సిబ్బంది, షీటీం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కథల పోటీల్లో కడవెర్గు విద్యార్థుల ప్రతిభ



పావని



శ్రీవిద్య



శ్రవణ్

చేర్యాల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా స్థాయిలో పెండోట బాలసాహిత్య పీఠం నిర్వహించిన బాల కథల పోటీల్లో చేర్యాల మండలం కడవెర్గు ఉన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి ప్రతిభ కనపర్చారు. 7వ తరగతి విద్యార్థిని పావని రాసిన రైతు గొప్పతనం' కథకు ద్వితీయ స్థానం పొంది రూ.300ల నగదు, 6వ తరగతి విద్యార్థిని శ్రీవిద్య రాసిన 'తీరిన చదువు కోరిక' కథకు ప్రోత్సాహక బహుమతి కింద రూ.100ల నగదు, కందుల శ్రవణ్ రాసిన ముగ్గురు స్నేహితులు కథ సాధారణ ప్రచురణకు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు అభినందించారు. చక్కటి ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

దుబ్బాక, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ కోరారు. మంగళవారం దుబ్బాక ఆర్యవైశ్యభవన్‌లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యకర్తలు బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం పని చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలేష్‌గౌడ్, శ్రీకాంత్, ఎస్ఎన్‌చారి, సంతోష్, ప్రవీణ్, అనిల్‌రెడ్డి తదితరులున్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 24 నుంచి 31 వరకు ఎస్ఏ 1 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అప్పటి వరకు 50 శాతం సిలబస్ పూర్తవ్వాలి. కానీ ప్రైవేట్ స్కూళ్లను మినహాయిస్తే ప్రభుత్వ పాఠశాలల్లో 45 నుంచి 46 శాతం మాత్రమే పూర్తయింది. జిల్లాలో కురిసిన వర్షాలు, వివిధ రకాల సెలవులు, దసరా హాలీడేస్ వంటి కారణాల వల్ల టార్గెట్ చేరుకోలేకపోయారు. అయితే ఎస్ఏ 1 వరకు 50 శాతం సిలబస్ కంప్లీట్ చేసి న తర్వాత పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే ఇప్పటికే పార్ట్2 పుస్తకాలు కూడా జిల్లా కార్యాలయంలో ఉన్నాయి. రెండు, మూడు రోజుల్లో పార్ట్ 2 పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. జనవరి 9 వరకు మొత్తం పోర్షన్ పూర్తి చేసి సంక్రాంతి సెలవుల తర్వాత మళ్లీ రివిజన్ మొదలు పెట్టాలని అధికారులు యోచిస్తున్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

పదవ తరగతి ఫలితాల్లో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా అదనపు తరగతులు ప్రారంభించాం. అనుకున్న ప్రకారంగా ప్రణాళికాబద్ధంగా సిలబస్ కంప్లీట్ అయ్యేలా ఉపాధ్యాయులు పనిచేయాలి. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా సహకారమందించాలి. ప్రతి ఒక్క విద్యార్థి అదనపు తరగతులను సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు సాధించాలి. మళ్లీ జిల్లాను మెరుగైన స్థానంలో నిలిపేందుకు అధికారులందరూ సమష్టిగా కృషి చేయాలి.

- శ్రీనివాసరెడ్డి, జిల్లా విద్యాధికారి

ప్రాణం తీసిన ప్రేమ వివాహం

(5వ పేజీ తరువాయి)



షాహీనా బేగం మృతదేహం

దీంతో ఆగ్రహానికి గురైన అమ్మాయి తల్లిదండ్రులు మంగళవారం సాయంత్రం అబ్బాయి ఇంటిపై దాడికి దిగారు. మాట మాట పెరగడంతో ఇనుపరాడుతో అబ్బాస్ తల్లి షాహీనా బేగం (50)ని బలంగా కొట్టారు. దీంతో ఆమెకు తలకు తీవ్ర గాయాలు కాగా చికిత్స కోసం 108 వాహనంలో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామంలో ఎలాంటి గొడవలు జరగకుండా గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి ఇంటి వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు బస్వాపూర్ గ్రామంలో పోలీస్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు పెద్ద సంఖ్యలో మృతురాలి ఇంటి వద్దకు చేరుకుంటుండగా పోలీసులు వారిని చెదరగొడుతున్నారు. ఘటనపై విచారణ చేపడుతున్నట్లు ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయమూర్తిపై దాడి ఘటన..

ప్రజాసంఘాల నిరసనలు



చేర్యాల సబ్‌కోర్టు వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు



హుస్నాబాద్ అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

హుస్నాబాద్‌రూరల్/కోహెడ/చేర్యాల/గజ్వేల్/బెజ్జంకి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపై కోర్టులోపల జరిగిన దాడిని ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణిస్తూ మంగళవారం జిల్లావ్యాప్తంగా వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసనలు వెల్లువెత్తాయి. హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కోఆర్డినేటర్, వైస్ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్, గంపల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయిపైకి తన కాలిబూటు విసరడం అనేది భారత రాజ్యాంగానికి తీరని మచ్చని పేర్కొన్నారు. కోహెడలో వివిధ ప్రజా సంఘాల నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. చేర్యాల మండలం గుర్జకుంట గ్రామంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు దర్శనం రమేష్ ప్రజాస్వామ్య వాదులతో కలిసి కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. చేర్యాల పట్టణంలో ఆర్ఎస్ఎస్ దిష్టి బొమ్మను దహనం చేశారు. చేర్యాల సబ్ కోర్టు న్యాయవాదులు విధులు బహిష్కరించి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. న్యాయవ్యవస్థపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేర్యాల బార్ అధ్యక్షుడు ఆరెల్ల వీరమల్లయ్య, ప్రధాన కార్యదర్శి తాటికొండ ప్రణీత్, కార్యదర్శి పొన్నం సురేష్‌కృష్ణ, అంకిణి సురేందర్, సీనియర్ న్యాయవాది భూమిగారి మనోహర్, ఆరెల్ల మహేందర్, న్యాయవాదులు బైరగోని ప్రసాద్, అమర్ పాల్గొన్నారు. బెజ్జంకి అంబేడ్కర్ కూడలిలో ప్రజా సంఘాల నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడి చేసేందుకు యత్నించిన న్యాయవాదిని వెంటనే విధుల నుంచి తొలగించి, అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రాజ్యాంగంపై దాడిగా పరిగణించాలి

గజ్వేల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి భారత రాజ్యాంగంపై జరిగిన దాడేనని గజ్వేల్ పట్టణంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి దళిత సంఘాల రాష్ట్ర కార్యదర్శి చిప్పల యాదగిరి అధ్యక్షత వహించారు. సమావేశంలో నాయకులు పొన్నాల కుమార్, దాసరి ఏగొండస్వామి, పంబాల ఎల్లయ్య, సత్యనారాయణ, బొల్లారం ఎల్లయ్య, రాజు, మన్నె కృష్ణ, రాజేశం, ఖాసీం, గడ్డం వెంకటేశ్ తదితరులున్నారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి చేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన గజ్వేల్ పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఈ దాడి న్యాయవ్యవస్థపై, భారత రాజ్యాంగంపై, భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాలన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



కొమురవెల్లి: ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమైన మండలస్థాయి అధికారులు

చేర్యాల/మద్దూరు/కొమురవెల్లి, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు ఏర్పాట్లు జరుగుతుండటంతో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా సహకరించాలని చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాల ఎంపీడీవోలు చిలుముల శ్రీనివాస్, ఎస్. రాంమోహన్, శ్రీనివాసవర్మ పేర్కొన్నారు. మంగళవారం చేర్యాల, మద్దూరు, కొమురవెల్లి మండలాల్లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో వేర్వేరుగా ఏర్పాటు చేసిన ఎన్నికల సమన్వయ సమావేశంలో వారు మాట్లాడారు. అభ్యర్థులందరూ ఎన్నికల కమిషన్ జారీ చేసిన ప్రవర్తనా నియమావళి ప్రకారం నడుచుకోవాలని సూచించారు. ఎన్నికల వ్యయం, నామినేషన్ పత్రాల సమర్పణ, నామినేషన్ రుసుము, నామినేషన్ వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఆయా సమావేశాల్లో చేర్యాల తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఎంపీవో విజయ్‌కుమార్, మద్దూరు ఎంపీవో వెంకటేశ్వర్లు, ఏవో రామకృష్ణ, సెక్రటరీలు, కొమురవెల్లి నాయబ్ తహసీల్దార్ వేణుగోపాల్, ఎంఈవో బొమ్మగోని రమేష్, ఏఎస్సై సత్యనారాయణ రెడ్డి, ఎంపీవో చిలుక కరుణాకర్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం



పంజాల రాజుగౌడ్‌కు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న శ్రీకాంత్‌రావు

గజ్వేల్, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన బీజేపీ నాయకులు పంజాల రాజుగౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం గత 22నెలల కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలతో ప్రజల్లో ఆదరణ పెరిగిందన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థులను గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. వెంట ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, టీపీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, తీగుల్ మాజీ సర్పంచ్ కప్పెర భానుప్రకాశ్‌రావు, ఆత్మ డైరెక్టర్ సయ్యద్ బాబా తదితరులున్నారు.

హరీశ్‌ను కలిసిన తిగుల్ నేతలు



మాజీ మంత్రి హరీశ్‌రావుతో తిగుల్ బీఆర్‌ఎస్ నేతలు

జగదేవ్ పూర్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిగుల్ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం మాజీ మంత్రి హరీశ్‌రావును హైదరాబాద్‌లో తన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జగదేవపూర్ జడ్పీటీసీ స్థానం బీసీ మహిళకు రావడంతో, జడ్పీటీసీ అవకాశం తిగుల్ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు పీఏసీఎస్ డైరెక్టర్ కామల్ల భూమయ్యకు అవకాశం ఇవ్వాలని హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. హరీశ్‌రావు సానుకూలంగా స్పందిస్తూ హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. అలాగే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి కూడా కలిశారు. కలిసిన వారిలో ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, మాజీ ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

పొన్నం వ్యాఖ్యలపై ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



హుస్నాబాద్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

హుస్నాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన ఓ సమావేశంలో రాష్ట్ర మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసభ్యకరమైన పదజాలంతో దూషించడం పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎనగందుల లక్ష్మీనారాయణ, ఇజం వెంకటస్వామి, మారపెల్లి శ్రీనివాస్, వెంకటస్వామి అశోక్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలను సత్వరమే చెల్లించాలి



అల్వాల గురుకుల పాఠశాలలో నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైం టీచర్లు

దుబ్బాక, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం టీచర్లకు ఉద్యోగభద్రతను కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలను చెల్లించాలని పార్ట్‌టైం టీచర్లు డిమాండ్ చేశారు. మంగళవారం దుబ్బాక, మండలంలోని రామక్కపేట గురుకుల పాఠశాలల్లో వేర్వేరుగా మధ్యాహ్న విరామసమయంలో పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నల్లబాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత మూడునెలలుగా పార్ట్‌టైం టీచర్ల వేతనాలను చెల్లించడం లేదన్నారు. దీంతో దసరా పండుగరోజున పస్తులుండవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్ట్‌టైం టీచర్లకు రావాల్సిన పెండింగ్ వేతనాలను చెల్లించాలని కోరారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో కుంకుమార్చన

హుస్నాబాద్, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం, చండీ హోమం పూజ మహానివేదన నీరాజనం, మంత్రపుష్పం ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, వెంకన్న, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, ఆలయ ఈవో పి కిషన్‌రావు, ఆలయ మాజీ చైర్మన్ పూదరి లక్ష్మీనారాయణ, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.